క్లుప్తంగా

ఎమ్మెల్యే కొడాలి నాని బక్రీద్ శుభాకాంక్షలు



గుడివాడటౌన్: త్యాగానికి విశ్వాసానికి మారుపేరైన బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) బుధవారం తెలిపారు. బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని, అల్లా దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. అల్లా దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నామని కొడాలి నాని పేర్కొన్నారు.

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు

గుడివాడ టౌన్: గుడివాడ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం యాత్రకు వెళ్లే భక్తులకోసం ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ ఈ బస్సు బయలుదేరుతుందని తెలిపారు. శ్రీకాలహస్తి, కాణిపాకం, శ్రీపురం దేవాలయాలు దర్శించుకుని 3వ తేదీ అరుణాచలం గిరి ప్రదక్షిణలు అనంతరం తిరిగి 4వ తేదీ ఉదయం బస్సు గుడివాడకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు ఆయన వివరించారు. వివరాలకు 99592 25464ను సంప్రదించవలసిందిగా కోరారు.

డిజిటల్ విద్యపై శ్రద్ధ చూపండి
డీఈవో తాహే రా సుల్తానా



పామర్రు: విద్యార్థులు రానున్న కాలంలో పోటీ పడేందుకు డిజిటల్ విద్యపై పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహే రా సుల్తానా అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీహైస్కూల్‌లో బుధవారం 'ఇంటరాక్టివ్ ప్లేట్ ప్యానల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రానున్న కాలంలో అంతా డిజిటల్ విద్యపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. పాఠశాలకు 11 ప్లేట్ ప్యానల్స్, ఒక స్మార్టు టీవీ ప్రభుత్వం అందజేసిందన్నారు. వీటి ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులను నిర్వహించాలన్నారు. పామర్రు ఎంఈవో-2 జీ పద్మవాణి, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వీ రాజేశ్వరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

గుడివాడరూరల్: ప్రభుత్వ సేవలు నేరుగా ప్రతి ఇంటికి చేరే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని చేపట్టిందని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిధిలోని కల్వపూడి అగ్రహారం సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం 11 రకాల సేవలను ప్రజలకు నేరుగా ఇంటికే అందించేందుకు గాను బృహత్తరమైన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. ఎంపీడీవో అనగాని వెంకటరమణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, కల్వపూడి, పర్నాస గ్రామాల సర్పంచ్‌లు పోటూరి నాంచారమ్మ, గొర్ల రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏలేటి ఆంజనేయులు (ఆగస్టిన్), వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీమన్నారాయణ, గద్దె వెంకటరామాంజనేయులు (రాము), సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువులే పిల్లలకు మనం ఇవ్వగలిగిన ఆస్తి

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు
- పామర్రులో నాలుగో విడత అమ్మ ఒడి పథకం ప్రారంభం
- తరలి వచ్చిన తల్లులు, అధికారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి రమేష్, కలెక్టర్, డీఈవో, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్, సింహాద్రి

పామర్రు: కృష్ణా జిల్లా స్థాయిలో నాలుగో విడత అమ్మ ఒడి పథకం ప్రారంభ కార్యక్రమంతో పామర్రులో పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో నాలుగో విడత అమ్మ ఒడి పథకం నిధుల జమ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల రాకతో సభా ప్రాంగణం సందడిగా మారింది. తొలుత ప్రార్థనా గీతాన్ని ఆలపించి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ గతంలో ఎంతో మంది పేదలు తమ పిల్లలను చదివించేందుకు అనేక కష్టాలు పడేవారని అన్నారు. కానీ ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి వారిని చదివించే బాధ్యత నాది అనే ధీమాను జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని అన్నారు. చదువులే పిల్లలకు మనం ఇవ్వగలిగిన ఆస్తి అని, చదువులకు చేసే ఖర్చంతా పిల్లల భవిష్యత్తుకు పెట్టుబడే అని అన్నారు. జిల్లా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ మనసున్న మంచి మనిషిగా పేదల కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం జగన్‌ను అందరం ఆదరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని అన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ పాఠశాలలో డ్రాపౌట్స్ సంఖ్యను గణనీయంగా తగ్గించాలనే మంచి ఉద్దేశంతో అమ్మ ఒడి పథకానికి కనీసం 75 శాతం అటెండెన్స్ ఉండేలా నిబంధన, పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపే బాధ్యత తల్లులుతీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయికి మించిన విద్యాబోధన సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్నారని అన్నారు.

తొలుత విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం జగనన్న అమ్మ ఒడి పథకం చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, ఎంఈవో-2 పద్మరాణి, మచిలీపట్నం డీవైఈవో సుబ్బారావు, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పామర్రు గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి, ఎంపీపీలు డి.అశోక్‌కుమార్, జీ సురేష్, కె.ఇందిర, జెడ్పీటీసీలు జె.రామ్మోహన్‌రెడ్డి, కె.స్వరూపరాణి, ఆర్.పార్వతి, వైఎస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏ రమాదేవి, ఎంపీటీసీలు పి.రత్నకుమారి, టీ శ్రీనివాసరావు, ఎస్.బేబి శాలినీ, పార్టీ నాయకులు పెయ్యల రాజు, కె.పెద వెంకటరెడ్డి, మోర్ల రామచంద్రరరావు, ఎం.పూర్ణ ప్రసాద్ మండల సచివాలయ కన్వీనర్లు, వార్డు సభ్యులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, చిన్నారుల తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులతో స్కూళ్లకు మహర్దశ

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ఫేజ్-2 కింద చేపట్టన్ను పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంఈఓ ఎస్.శ్రీనివాస్, సర్పంచ్ బి.నాగమణి, ఎంపీటీసీలు మరీదు రాజ్యలక్ష్మి, అంకకుమారి, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, పున్నయ్యబాబు, కొణతం శివరామకృష్ణ, అజీజ్, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి ఇళ్లు నిర్మించాలి



గుడివాడ టౌన్: జగనన్న కాలనీల్లో లక్ష్యానికి మించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మల్లాయిపాలెం జగనన్న లే-అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో 5 లక్షలు ఇళ్ల నిర్మాణం జరగాలని లక్ష్యంగా పెట్టిందన్నారు. ఇప్పటికే రూఫ్ లెవల్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారులతో సెంట్రింగ్ పెట్టించి స్లాబులు పూర్తి చెయ్యాలన్నారు. అధికారులు ఈదిశగా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఎం.రామోజీ నాయక్, అర్బన్ ఏఈ సుబ్బారావు, బ్లాక్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై త్వరితగతిన స్పందిస్తాం
జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు నాగమునిమ్మ

గుడివాడరూరల్: మహిళల సమస్యల పరిష్కారానికి జిల్లా సమైక్య సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ అన్నారు. మండలంలోని చిరిచింతల గ్రామానికి చెందిన భవ్యశ్రీ (22), పెదపారుపూడి మండలం నాగాపురానికి చెందిన గంజి రాజేష్‌లకు మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి నాలుగు నెలల బాబు ఉన్నాడు. ఇటీవల కాలంలో భవ్యశ్రీని భర్త రాజేష్, అత్తమామలు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుడివాడరూరల్ పోలీస్ స్టేషన్‌లో భవ్యశ్రీ ఫిర్యాదు చేసింది. సమస్యను తెలుసుకున్న జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు నాగమునిమ్మ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ డీటీ సుందరరావు సమక్షంలో స్థానిక వెలుగు కార్యాలయంలో ఇరు కుటుంబాల సభ్యులను పిలిచి చర్చలు నిర్వహించారు. భర్త రాజేష్, అతని కుటుంబ సభ్యులు భవిష్యత్‌లో భవ్యశ్రీని ఇబ్బంది పెట్టమని లిఖితపూర్వకంగా ఐకేపీ సంఘ సభ్యులకు అంగీకారపత్రం అందజేశారు. అంగీకరపత్రాన్ని రూరల్ ఎస్‌ఐ మూర్తికి అందజేసి రాజీ ప్రతిపాదనను తీసుకువస్తామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



సానారుద్రవరంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు(కలిదిండి): ప్రజలకు సంతృప్తికర స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కలిదిండి మండలం సానరుద్రవరంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలు, ఇతర నిధులు రూ.5 లక్షలు వెరసి రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సానరుద్రవరంలోని ఎస్టీ కాలనీలో నాడు-నేడు కింద మంజూరైనా పాఠశాల పనులు, రోడ్లు, కోరుకొల్లులోని రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం గోడౌన్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అనేక గ్రామాల్లో సమస్యలను గుర్తించామన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేస్తున్నామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో అభివృద్ధి మరింతగా సాధించాలన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి నున్న రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షులు వడ్లాని పార్థసారథి, అంబెం నరసయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, మారుబోయిన విష్ణు, నున్న భగవాన్, కోరుకొల్లు ఉప సర్పంచి చన్నంశెట్టి నాగరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చన్నంశెట్టి కోదండ రామయ్య, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోవులను వధిస్తే చర్యలు తప్పవు

టూటౌన్ సీఐ తులసీధర్



గోవధ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సీఐ తులసీధర్

గుడివాడరూరల్: గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ బి.తులసీధర్ అన్నారు. బక్రీద్ సందర్భంగా టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్‌మన్‌పేట, అంజుమాన్ సెంటర్‌లలో గోవధ నిషేధంపై ప్రజలకు సీఐ బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో గోవును గోమాతగా భావించి పూజిస్తారని, అటువంటి గోవులను వధించటం చట్ట విరుద్ధమన్నారు. గోవులను వధించే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ముస్లిం మత పెద్దలతో పాటు పలు సామాజిక వర్గాల ప్రజలతో సీఐ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, పలు సామాజిక వర్గాలకు చెందిన పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన



చౌటపల్లి గ్రామంలో వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న దుక్కిపాటి

గుడివాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పీడబ్ల్యూసీ స్కీమ్‌లో భాగంగా రూ.61.52 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణం, ఇంటింటి కుళాయి ఏర్పాటు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) కృషితో తాగునీటి సమస్యలకు చెక్ పెట్టేందుకు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. ఎంపీపీ గద్దె పుష్పరాణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే కొడాలి నాని నిధులు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. మరోమారు ఎమ్మెల్యేగా కొడాలి నానిని చేస్తే గ్రామాల్లో సమస్యలే ఉండవని స్పష్టం చేశారు. ఎంపీడీవో అనగాని వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి డీఈ అట్లూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, సర్పంచి వెలగలేటి రమ్య, వైఎస్సార్ సీపీ సీనియర్‌నాయకుడు సూరపనేని కళ్యాణ్, అట్లూరి గాంధీ, గద్దె వెంకట రామాంజనేయులు (రాము), పంచాయతీ కార్యదర్శి పాగోలు పూర్ణచంద్రరావు, కాంట్రాక్టర్ భద్రం, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు అభినందన

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల బాలుర బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ క్రీడాకారులు చాంపియన్‌గా నిలిచారని ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు పాలేటి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి) తెలిపారు. బుధవారం స్టేడియం పాలకవర్గం క్రీడాకారులను అభినందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన మొదటి రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో తమ క్రీడాకారులు ప్రతిభను చూపించి విజేతలుగా నిలిచారన్నారు. మొత్తం 23 జిల్లాలు పాల్గొన్న ఈ పోటీలో తమ జట్టు అనకాపల్లి జట్టుపై 42-35 స్కోర్‌తో విజయం సాధించారన్నారు. బల్లి దేవదానం, నడావర్ధన్, చీకటి కృష్ణ తన్వీర్ రాష్ట్ర ఉత్తమ క్రీడాకారులుగా అవార్డులు పొందారని తెలిపారు. రానున్న క్రీడల్లో సైతం తమ క్రీడాకారులు విజయం సాధించేలా ప్రోత్సహిస్తామన్నారు. స్టేడియం కమిటి సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, బొగ్గారపు తిరుపతయ్య,రాజీవ్‌కుమార్‌జీవావత్, చింతా రఘుబాబు, దొప్పలపూడి రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సాంఖ్యాశాస్త్ర దినోత్సవం

గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో బుధవారం జాతీయ సాంఖ్యాశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారత సాంఖ్యాశాస్త్ర పితామహుడు ప్రొఫెసర్ పీసీ మహలనోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహలనోబిస్ జీవిత చరిత్ర, సాంఖ్యాశాస్త్ర ఉపయోగాలను వివరించారు. తొలుత ఆయన చిత్రపటానికినివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, సాంఖ్యాశాస్త్ర విభాగాధిపతి పి.శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల వ్యాపారిపై కేసు నమోదు

గుడివాడరూరల్: చేపల తరలింపునకు వాహనాలను అద్దెకు తీసుకుని కిరాయి చెల్లించకుండా చేపల వ్యాపారి ఇబ్బంది పెడుతున్నాడని ట్రాన్స్‌పోర్ట్ యజమాని గుడివాడ టూటౌన్ పోలీసులను బుధవారం ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ పెదకాల్వ సెంటర్‌లో శ్రీఆంజనేయ ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ నడుపుతున్న మద్దినేని ప్రభాకరరావు చేపలను ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు వాహనాలను సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన రుద్రరాజు సుబ్బరాజుకు రెండు సంవత్సరాలుగా చేపల తరలింపునకు వాహనాలను సరఫరా చేశాడు. ఈ లావాదేవీల్లో ట్రాన్స్‌పోర్ట్ యజమాని ప్రభాకరరావుకు రూ.70 లక్షల మేర సుబ్బరాజు కిరాయిల నిమిత్తం నగదు ఇవ్వాల్సి ఉంది. కిరాయి సొమ్ము ఇవ్వాలని ఎన్నిమార్లు కోరినా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ప్రభాకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుడివాడ టూటౌన్ సీఐ బి.తులసీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ల డోర్ నంబర్లు నమోదు చేయండి

గుడ్లవల్లేరు: మండలంలోని ప్రతి ఓటరు డోర్ నంబరు నమోదు చేయాలని తహసీల్దార్ అబ్దుల్ రెహామాన్ మస్తాన్ కోరారు. బుధవారం మండల కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 20 మంది ఓటర్ల డోర్ నంబర్ ఒకే క్రమంలో ఉండేలా బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి నమోదు చెయ్యాలన్నారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల అధికారులు సూచించారని, సాధ్యమైనంత త్వరలో జాబితాలు పూర్తికావాలన్నారు. డీటీ బి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చేపల సాగు హక్కులకు వేలం

మండవల్లి: మండవల్లిలోని శ్రీగాంధీ సేవాశ్రమానికి చెందిన రెండు ఎకరాల 59 సెంట్లు చేపల చెరువులో చేపల పెంపకం హక్కులకు బుధవారం వేలం నిర్వహించారు. మూడు సంవత్సరాల కాల పరిమితికి కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు బహిరంగ వేలం నిర్వహించారు. తనిఖీదారు సుధాకర్ పర్యవేక్షణలో బహిరంగ వేలం జరిగింది. స్థానిక మెతుకుల సత్యనారాయణ ఏడాదికి ఎకరాకు రూ.46 వేల వంతున రూ.లక్ష 19 వేల140 చెల్లించే విధంగా వేలంలో దక్కించుకున్నట్లు ఈఓ పేర్కొన్నారు. మండలంలోని అల్లినగరం లో శ్రీ రాజగోపాల్ స్వామి దేవస్థానాలకు చెందిన రెండు ఎకరాల 30 సెంట్లు చెరువు వేలం నిర్వహించారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

కై కలూరు: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దుగుబడులు సాధించాలని ఏలూరు ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్ట్, సమన్వయకర్త టి.సుజాత, శాస్త్రవేత్తలు కె.ఫణికుమార్, ఎస్.నాగేంద్రబాబు సూచించారు. కై కలూరు ఏడీఏ ఆర్.గంగాధరరావు అధ్యక్షతన రాచపట్నం రైతు భరోసా కేంద్రం వద్ద నూతన వరి వంగడాలపై అవగాహన బుధవారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఎంసీఎం-103, ఎంసీఎం-125, ఎంటీయూ-1232రకాలు చౌడు భూములను తట్టుకుని పెరుగుతాయన్నారు. వంగడాల సంచులను రైతులకు పంపిణీ చేశారు. సర్పంచి అల్లూరి మంగారావు, ఏఈ ఆర్.దివ్య, సాయిల శ్యామల రావు, వీఏఏ ధర్మతేజ పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, యలమర్రు సచివాలయ వద్ద వలంటీర్లకు జగనన్న సురక్షపై బుధవారం ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ తిరగాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సాగర రాణి, చైతన్య శ్రీనివాస్, వీఆర్వోలు వెంకట్, చాట్ల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కౌతవరంలో లేగదూడల ప్రదర్శన



అధికారుల నుంచి బహుమతి స్వీకరిస్తున్న రైతు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉప సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసులు, గుడ్లవల్లేరు ఏడీ లక్ష్మీనారాయణ, పశువైద్యాధికారి డాక్టర్ టి.వేణు పర్యవేక్షణలో ఈ ప్రదర్శన జరిగింది. పెయ్యదూడల ఆరోగ్యం-అందాలు విభాగంలోప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.దివాకర్, ఎంపీటీసీ ఈడే లక్ష్మి, పటమటి సుజాత పాల్గొన్నారు.